సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



సాగులో యాంత్రీకరణ

దుక్కి దున్నింది మొదలు విత్తనం నాటడం, పంట చేతికొచ్చే వరకు యంత్రాల వినియోగం విపరీతంగా పెరిగింది.

వివరాలు 8లో ▸



తాటి ముంజ.. భలే మజా

అల్లీపూర్ అనగానే టక్కున గుర్తుకొచ్చేది తాటి ముంజలు. ఎండలు మండిపోతుండడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది.

వివరాలు 8లో ▸



ఎన్నాళ్లిలా?

ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కొత్త మండలం ఏర్పాటు చేసినా నేటికీ సొంత భవనాలను నిర్మించలేదు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

దళారులకు ధాన్యం అమ్మొద్దు

జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విద్యాసాగర్



కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న విద్యాసాగర్

అక్కన్నపేట(హుస్నాబాద్): ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విద్యాసాగర్ రైతులకు సూచించారు. అక్కన్నపేట మండలంలో 11 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు 4,774 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. సోమవారం మండలంలోని గోవర్ధనగిరి, పెద్దతండా, నందారం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరుగాలం శ్రమించిన పంటలను మద్దతు ధరకు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో డీఎం ప్రసాద్, ఏపీఎం శ్రీనివాస్, సీసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

అక్కన్నపేట (హుస్నాబాద్): ఉపాధి హామీ పనులను రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు డీఆర్‌డీఓ బాలకృష్ణ కోరారు. మండలంలోని చౌటపల్లిలో ఉపాధి హామీ పనులు, నర్సరీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు చేస్తున్న పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. అదేవిధంగా ఎండ తీవ్రత అధికంగా ఉండడం వలన కూలీలు ఉదయాన్నే వచ్చేలా చూడాలన్నారు. అలాగే కూలీల సంఖ్యను పెంచాలని అధికారులకు సూచించారు. కూలీల నమోదు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ పరంధాములు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు



మిరుదొడ్డిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న రఘునందన్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఓటర్లు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. సోమవారం మిరుదొడ్డి మండల కేంద్రంతో పాటు, అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకట్రామిరెడ్డి కొండ పోచమ్మ ప్రాజెక్టు, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నిర్మాణాల్లో పోలీసుల పహారాలో రాత్రికి రాత్రే గ్రామాలను ఖాళీ చేయించారని మండిపడ్డారు. ప్రజలు అష్ట కష్టాలు పడుతుంటే ఏసీ రూముల్లో కూర్చున్న వెంకట్రామిరెడ్డిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గతంలో కలెక్టర్‌గా పని చేసినన్ని రోజులు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు.

విధుల పట్ల అశ్రద్ధ తగదు

డీఎంహెచ్ఓ శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: ఆశాలు, వైద్య సిబ్బంది విధుల్లో సమయ పాటించాలని డీఎంహెచ్ఓ శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆశా నోడల్ ఆఫీసర్లతో డీఎంహెచ్ఓ సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. గర్భిణుల ఆరోగ్య వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ప్రతి బుధ, శనివారం జరిగే వ్యాధి నిరోధక టీకాల సెషన్‌లో ఆశా కార్యకర్తలు తప్పకుండా పాల్గొనాలన్నారు. క్షయ, లెప్రసీ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి మందులు అందజేయాలని సూచించారు.





బడికి టాటా.. ఇక ఆటాపాట

ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఇంటిబాట పట్టారు. బడులకు వేసవి సెలవులు ఇవ్వడంతో సోమవారం వివిధ గురుకుల పాఠశాలల నుంచి విద్యార్థులను తల్లిదండ్రులు తీసుకువెళ్లారు. దీంతో సిద్దిపేట పట్టణంలోని బస్టాండ్, ప్రధాన చౌరస్తాలు, తదితర ప్రాంతాలు విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడిగా కనిపించాయి. ఇక విద్యార్థులు ఆటపాటల్లో మునిగితేలనున్నారు.
- ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

అతిరథులొస్తున్నారహో..

- ఈ నెల 25న బీజేపీ అగ్రనేత అమిత్‌షా రాక
- వచ్చే నెల 7, 8, 10 తేదీల్లో కేసీఆర్ బస్సు యాత్ర
- త్వరలో కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ..
- హీటెక్కనున్న ఎన్నికల ప్రచారం



అమిత్‌షా



కేసీఆర్



ప్రియాంక గాంధీ

సాక్షి, సిద్దిపేట: మెతుకుసీమకు వివిధ పార్టీల అతిరథులు వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వరుస పర్యటనలతో రాజకీయ వేడిని పెంచబోతున్నారు. ఎంపీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతోంది. ఈ నెల 25 వరకు స్వీకరించనున్నారు. ఇప్పటికే మెదక్ ఎంపీ బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు, పలువురు ఇండిపెండెంట్లు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 24న బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నామినేషన్ వేయనున్నారు. నామినేషన్ల స్వీకరణ పర్వం ముగియగానే ఎవరెవరు బరిలో నిలువనున్నారో తేలనుంది. తర్వాత ప్రచారం ముమ్మరం చేయనున్నారు. అందుకోసం ఆయా పార్టీలకు చెందిన జాతీయ, రాష్ట్ర నేతలను ప్రచారం కోసం ఆహ్వానిస్తున్నారు.

బీజేపీ బహిరంగ సభ

బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 25న సిద్దిపేటకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా వస్తున్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఇందుకు ఇప్పటి నుంచే భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రజలను తరలించేందుకు నాయకులు చర్యలు చేపడుతున్నారు. ఆ తరువాత మరో రోజు కూడా మెదక్ సెగ్మెంట్ పరిధిలో బహిరంగ సభను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ నెల 18న నామినేషన్ సందర్భంగా గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి హాజరై సమావేశంలో మాట్లాడారు.

బీఆర్ఎస్ బస్సు యాత్ర

ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్ర చేపడుతున్నారు. మే 7న మెదక్ లోక్‌సభ పరిధిలో, 8న నర్సాపూర్, పటాన్‌చెరు, 10న సిద్దిపేటలో కేసీఆర్ రోడ్ షోను నిర్వహించనున్నారు. వచ్చే నెల 16న జహీరాబాద్‌లో ప్రజా ఆశీర్వాద సభకు కేసీఆర్ హాజరవుతున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారు అయినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

తరలిరానున్న కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ జాతీయ నాయకులు తరలివస్తున్నారు. ఇప్పటికే ఈ నెల 20న నీలం మధు నామినేషన్ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరై కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. అలాగే ఈ నెల చివరిలో, మే మొదటి వారంలో సభలను సిద్దిపేట, సంగారెడ్డిలలో నిర్వహించనున్నారు. ఈ సభలకు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఇందిరా గాంధీ ఎంపీగా ప్రాతినిథ్యం వహించి దేశ ప్రధానిగా సేవలందించారు. ఆ సెంటిమెంట్ కోసం ప్రియాంక గాంధీ ఎన్నికల ప్రచారానికి వచ్చే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

అండగా ఉంటా.. ఆశీర్వదించండి

ప్రతి పథకం పేదల దరి చేర్చుతా

- నెలలో ఒక్కోరోజు ఒక్కో నియోజకవర్గానికి కేటాయిస్తా
- పేదల కోసం అవసరమైతే సొంత నిధులు ఖర్చు పెడతా
- మూత పడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తా
- మెట్రో తెచ్చేందుకు కృషి చేస్తా
- సాక్షి ఇంటర్వ్యూలో కాంగ్రెస్ మెదక్ అభ్యర్థి నీలం మధు



"ఇందిరమ్మ ప్రాతినిథ్యం వహించిన మెదక్ లోక్‌సభ స్థానం నుంచి నేను పోటీ చేయడం అదృష్టంగా భావిస్తున్న. నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ నాయకులందరూ సహకరిస్తున్నారు. అందరిని కలుపుకొని ముమ్మరంగా ప్రచారం చేస్తున్న. గెలుపు కోసం కార్యకర్తలందరూ కష్టపడుతున్నారు. బీసీ వర్గానికి చెందిన నాకు బడుగు బలహీన వర్గాలందరి ఆశీర్వాదాలు ఉన్నాయి. నన్ను ఎంపీగా గెలిపిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతీ పథకం పేదలకు అందేలా కృషి చేస్తా. రైతులకు, కార్మికులకు అండగా ఉంటా. హైవే రోడ్ల అభివృద్ధికి, సంగారెడ్డి వరకు మెట్రో తెచ్చేందుకు కృషి చేస్తాన ని" లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ మెదక్ అభ్యర్థి నీలం మధు చెప్పారు. 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను ఎంపీగా గెలిస్తే చేపట్టే పలు అంశాలను వివరించారు. - పటాన్‌చెరు

☛ ఇందిరాగాంధీ ప్రాతినిథ్యం వహించిన మెదక్ స్థానానికి కాంగ్రెస్ టికెట్ పొందడంపై మీ అభిప్రాయం ఏమిటి?

ఇందిరమ్మ ఎంపీగా సేవలందించిన మెదక్ నుంచి కాంగ్రెస్ టికెట్ పొంది పోటీ చేయడం నా పూర్వ జన్మ సుకృతం. ఆమె సేవలు ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకున్నారు. ఈ ప్రాంతానికి ఇందిరమ్మ వల్లే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు వచ్చింది. అలాగే పేదలకు ఇళ్ల జాగాలు, అసైన్డ్ భూములు దక్కాయి. జిల్లా అభివృద్ధికి అప్పుడే బీజాలు పడ్డాయి. ఇక్రిశాట్, బీడీఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు ఏర్పాటయ్యాయి. ఇక్కడి నుంచి బడుగు బలహీన వర్గానికి చెందిన నాకు పోటీ చేసే అవకాశం కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు.

☛ ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేస్తారు?

ప్రభుత్వ పరంగా జిల్లాకు రావాల్సిన ప్రతి పైసా తెప్పిస్తా. దేశంలోనూ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలన్నీ పేదల దరి చేర్చుతా. ప్రతీనెలా ఒక్కోరోజు ఒక్కో నియోజకవర్గ పరిధిలో ప్రత్యేకంగా కేటాయించిన స్థానిక నాయకులు, ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తా. ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. పేదలకు కావాల్సిన సహాయ సహకారాల కోసం సొంత నిధులను కూడా ఖర్చు పెడతా. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో భాగంగా రైతులకు రూ.500 బోనస్, ఇతర పథకాలను ప్రజలకు అందేలా చూస్తా. జిల్లాలో మూత పడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తాం. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేస్తాం. ఉద్యాన పంటల అభివృద్ధికి, వ్యవసాయ ఉత్పత్తులకు కావాల్సిన ప్యాకేజింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేయిస్తా. కార్మికుల శ్రేయస్సు కోసం పని చేస్తా. వారికి అండగా ఉంటూ సామాన్యుడిలా సేవ చేస్తా.

☛ కాంగ్రెస్ పార్టీలో కొందరు సహకరించడం లేదని ప్రచారం జరుగుతోంది..?

ప్రతి నాయకుడు, కార్యకర్త మనస్ఫూర్తిగా సహకరిస్తున్నారు. పార్టీ గెలుపు కోసం ప్రతీ ఒక్కరు కృషి చేస్తున్నారు. ఎవరిపైనా ఎలాంటి ఫిర్యాదులు చేయలేదు. ఆ అవకాశమే రాదు. పార్టీ నాయకత్వం సూచనల మేరకు అందరితో కలిసి పోతున్న.

☛ బీఆర్ఎస్‌కు బలం ఉన్న నియోజకవర్గాల్లో మీ ప్రచార వ్యూహం ఎలా ఉంది..?

నామినేషన్ పర్వం ముగిసింది. అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం ముమ్మురంగా సాగుతోంది. కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపడానికి ప్రజలు స్వచ్ఛందంగా తరలి వస్తున్నారు. పార్టీకి వార్డు, గ్రామ స్థాయిల్లో బలమైన కేడర్ ఉంది. ముమ్మందు ప్రచారంలో దూసుకుపోతాం. అన్ని నియోజకవర్గాల్లో నాకు మంచి మెజారిటీ వస్తుంది. బీసీ వర్గానికి చెందిన నాకు బడుగు బలహీన వర్గాలందరి ఆశీర్వాదాలు ఉన్నాయి.

☛ జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి, సంగారెడ్డి వరకు మెట్రోపై మీ స్పందన ఏమిటి?

జిల్లా నుంచి ఇతర మార్గాలకు కావాల్సిన రోడ్డు, రైలు మార్గాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయి. కేంద్రం నుంచి నిధులు తెప్పించి రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తా. సంగారెడ్డి వరకు మెట్రో రైలు వచ్చేలా కృషి చేస్తా.

☛ మీ విజయ అవకాశాలు ఎలా ఉన్నాయి..?

నా గెలుపు విషయంలో ఎలాంటి అనుమానాల్లేవ్.. నూటికి నూరుశాతం గెలుస్తా.

☛ మీకు ప్రధాన ప్రత్యర్థి ఎవరు..?

ప్రత్యర్థి ఎవరనేది ఇక్కడ అంశం కాదు. ఆరు గ్యారంటీల అమలుతో ప్రజల నుంచి మంచి స్పందన ఉంది. పార్టీ సహకారం.. ప్రజల ఆదరణతో ప్రత్యర్థి ఎవరున్నా.. గెలుపు నాదే.

పేదల సంక్షేమమే ముఖ్యం



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

- డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి
- కాంగ్రెస్‌లో పలువురి చేరిక

గజ్వేల్: పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్‌లో బీఆర్ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్లల్లో అవినీతి, నియంతృత్వ పాలన రాజ్యమేలితే నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాపాలన కొనసాగుతున్నదని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటేలా కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రాజ్‌కుమార్, నాయకులు కొండల్ రెడ్డి తదితరులున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నీలం గెలుపుకోసం కృషి చేయాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి కార్యకర్తలకు సూచించారు. సోమవారం మండలంలోని గొల్లపల్లికి చెందిన బీఆర్ఎస్, బీజేపీకి చెందిన నాయకులు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. నీలం మధు గెలుపే లక్ష్యం కావాలన్నారు.

తాగునీటి సమస్య రావొద్దు

డీపీఓ దేవకీదేవి

మద్దూరు(హుస్నాబాద్): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మద్దూరు, చేర్యాల పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారులతో తాగునీరు, పారిశుద్ధ్యంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి లెకుండా చూడాలని, నీటి సమస్య ఉన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహన్, ఎంపీఓ ఖాజా మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సమ్మర్ క్యాంప్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో చిన్నారుల కోసం సంస్కృతి సమ్మర్ క్యాంప్‌ను ఈ నెల 25 నుంచి మే 15 వరకు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్‌కుమార్ పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో ఈ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 99669 32727 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేను.. పక్కా లోకల్

- నన్ను ఓడించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ కుట్రలు
- కరీంనగర్ అభివృద్ధికి రూ.12వేల కోట్లు తెచ్చా
- బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్

హుస్నాబాద్: 'నేను పక్కా లోకల్.. రూ.12వేల కోట్ల నిధులతో కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేశా'నని బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో సోమవారం బీజేపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంతకు ముందు గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి స్వాగతం పలికారు. సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు అభ్యర్థులు దొరకక, బయటి ప్రాంతాల నుంచి తీసుకువస్తున్నారన్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నయా పైసా నిధులు ఇవ్వలేదని, అందుకే మాజీ సర్పంచ్‌లు బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల అభివృద్ధికి కేంద్రమే నిధులు ఇచ్చిందన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులతోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం కరెంట్ బిల్లులను కట్టిందన్నారు. పల్లెల అభివృద్ధికి పాటుపడిన సర్పంచ్‌లను నిలువునా మోసం చేసిందన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలో ప్రజలు ఆలోచించాలన్నారు. కరీంనగర్ ఎంపీగా నన్ను ఓడించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. 'హుస్నాబాద్ ఎమ్మెల్యే నన్ను వెధవ అంటున్నారు. ఆయన పై నాకు ఎలాంటి ద్వేషం లేదు. ఆయన నన్ను ఎంత తిట్టినా పడతా'నని బండి అన్నారు. హామీలపై మొదట శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు.



బీజేపీలో చేరుతున్న వారికి పార్టీ కండువా కప్పుతున్న బండి సంజయ్

బీజేపీలో చేరిక

అక్కన్నపేట మండలంలోని కట్కూర్, కుందనవానిపల్లె, దుబ్బతండా మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన వందలాది మంది నాయకులు బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సమావేశంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్, పార్టీ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించి తీర్పు ఇవ్వండి

నా ఎంపీ పదవి కాలాన్నీ ప్రజల సేవ కోసమే పని చేశానని ఎంపీ బండి సంజయ్ అన్నారు. సోమవారం కోర్టు సమీపంలో బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్నికల తర్వాత సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మేధావులంతా ఆలోచించి ఓటు వేయాలన్నారు. అనంతరం న్యాయవాదులు బండి సంజయ్‌ని సన్మానించారు.

ఓటింగ్ శాతం పెంచితే ప్రోత్సాహక నగదు

కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని బీజేపీ నాయకులకు ఎంపీ బండి సంజయ్ బంపర్ ఆఫర్ ప్రకటించారు. 80 నుంచి 100 శాతం ఓటింగ్ నమోదయ్యేలా కృషి చేసిన నాయకులకు రూ.10వేల ప్రోత్సాహక నగదు అందజేస్తామని తెలిపారు. హుస్నాబాద్‌లో నిర్వహించిన ఎస్టీ మోర్చా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. ఓటింగ్ శాతం పెంచేందుకు స్వచ్ఛంధ సంస్థలతో పాటు అన్ని రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలన్నారు.

ఇదిలా ఉంటే.. ఇటీవల హుస్నాబాద్, పొట్లపల్లి మధ్య కాలిపోయిన తాటి చెట్లను బండి సంజయ్ పరిశీలించారు. తాటి చెట్ల దగ్ధానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన గీత కార్మికులను పరామర్శించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేతన్నలకు అండగా ఉంటాం

- వస్త్రాలను కొనుగోలు చేస్తాం
- చేనేత, జౌళి శాఖ కమిషనర్ వర్షిణి



చేనేత సహకార సొసైటీలో కమిషనర్ వర్షిణి, అదనపు కలెక్టర్ తదితరులు

సిద్దిపేటజోన్: చేనేత కార్మికులు ధైర్యంగా ఉండాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త వస్త్రాలను తయారు చేయాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ అలుగు వర్షిణి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చేనేత సహకార సంఘాలు, చేనేత వస్త్రాల తయారీ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఫిక్కీ మహిళా సంఘం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సొసైటీలో చేనేత కార్మికులు నేస్తున్న వస్త్రాలను పరిశీలించారు. ప్రస్తుత డిమాండ్ మేరకు మేలకువలతో కూడిన వస్త్రాలను తయారీ చేయాల్సిన అవసరం గురించి వివరించారు. ప్రఖ్యాతి గాంచిన గొల్లభామ, రామప్ప సిల్క్ చీరలను పరిశీలించారు.వాటిని కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. అవసరమైన ముడి సరుకులను ఫిక్కీ ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చేనేత సొసైటీ ఆధ్వర్యంలో లెనిన్ వస్త్రాల తయారీకి అవసరమైన లెనిన్ దారం టెస్కో ద్వారా అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఆమె వెంట టెస్కో ఓఎస్డీ రతన్ కుమార్, జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి సంతోష్, ఏడీఓ ప్రవీణ్, సంఘాల ప్రతినిధులు శ్రీనివాస్, రవితేజ, మల్లికార్జున్, గాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



మగ్గాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

క్లుప్తంగా

పురుగుల ఐస్‌క్రీమ్ విక్రయం

దుకాణంపై రూ.10 వేలు జరిమానా



ఐస్‌క్రీమ్‌లను తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్

సాక్షి ఎఫెక్ట్

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధి ప్రజ్ఞాపూర్‌లోని జగదేవ్‌పూర్ రోడ్డు చౌరస్తాలో గల ఓ స్మార్ట్ పాయింట్‌లో వినియోగదారుడికి పురుగుల ఐస్‌క్రీమ్ విక్రయించారని 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆదేశాల మేరకు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ స్మార్ట్ పాయింట్‌ను తనిఖీ చేశారు. అనంతరం రూ. 10 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తేదీ అయిపోయిన వాటిని విక్రయిస్తే మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని గిరిజన బాలుర కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలం దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. న్యాయ పరమైన సేవలు కావాలన్నా సంప్రదించాలన్నారు.

ఫోక్సో కేసులో 10 ఏళ్ల జైలు, జరిమానా

దుబ్బాక: ఫోక్సో కేసులో ఓ నేరస్తుడికి 10 ఏళ్ల జైలుతోపాటు జరిమానా విధిస్తూ సిద్దిపేట ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ కోర్టు జడ్జి తీర్పు వెల్లడించారని సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ తెలిపారు. సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామంలో ఓ ఫౌల్ట్రీ ఫాం లో పని చేసుకొని జీవిస్తున్న కుటుంబంలోని 15 ఏళ్ల బాలికను 2021 అక్టోబర్‌లో సూరంపల్లికి చెందిన తలారి శ్రీకాంత్(20) కిడ్నాప్ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధిత బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు దౌల్తాబాద్ ఎస్‌ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేయగా, అప్పటి తొగుట సీఐ రవీందర్ కేసు దర్యాప్తు ప్రారంభించి శ్రీకాంత్‌ను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సోమవారం జడ్జి ఇరువురి వాదనలు విని నేరస్తుడికి 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని సీపీ తెలిపారు. ఈ కేసు లో కీలక పాత్ర వహించిన సీఐ కమలాకర్‌తోపాటు కోర్టు కానిస్టేబుల్స్ లావణ్య, రఘు, భాస్కర్, రాజమల్లుతోపాటు భరోసా సిబ్బందిని సీపీ అభినందించారు.

అప్పుల బాధ భరించలేక..

యువకుడి ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

హుస్నాబాద్: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి హుస్నాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కేబీ కాలనీకి చెందిన మట్టెల ప్రశాంత్ (27) ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రశాంత్‌కు భార్య సోనీ, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. అవసరాల నిమిత్తం ఫైనాన్స్‌దారుల నుంచి అప్పు తీసుకున్నాడు. రోజువారీ చెల్లింపులు చేయాలి. తాను చేసే పనికి వచ్చే ఆదాయం ఇంటి అవసరాలకు సరిపోలేదు. మరో వైపు ఫైనాన్స్‌దారులు ప్రతి రోజూ ఇంటికొచ్చి డబ్బులు చెల్లించాలని వేధింపులకు గురి చేశారు. అప్పులు తీర్చలేక, ఫైనాన్స్‌దారుల వేధింపులు తాళలేక మానసికంగా కుంగిపోయిన ప్రశాంత్ కరీంనగర్ రోడ్‌లోని గోమాత జిన్నింగ్ మిల్లు సమీపంలోని ఓ మామిడి తోటలో రాత్రి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

సాగులో యాంత్రీకరణ

వ్యవసాయ రంగంలో ఆధునికత చోటు చేసుకుంటోంది. దుక్కి దున్నింది మొదలు విత్తనం నాటడం, పంట చేతికొచ్చే వరకు యంత్రాల వినియోగం విపరీతంగా పెరిగింది. గతంలో యాంత్రీకరణ అందుబాటులో లేనప్పుడు ఏ రకమైన వ్యవసాయమైనా రైతులు కూలీలతోనే చేయించేవారు. ఉపాధి హామీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి పల్లెల్లో కూలీల కొరత, రేట్లు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం రైతులు యంత్రాల ద్వారా పనులు చేపడుతున్నారు. పొలాన్ని నాటుకు సిద్ధం చేయడం మొదలుకొని పంట చేతికొచ్చాక మార్కెట్‌కు తీసుకెళ్లడం వరకు యంత్రాలనే వాడుతున్నారు.

– వెల్దుర్తి(తూప్రాన్)



హార్వెస్టర్ ద్వారా వరిపంట కోయిస్తున్న రైతు

- ఆధునిక పనిముట్లతో వ్యవసాయం
- తగ్గుతున్న పెట్టుబడి ఖర్చు
- వరికోత, నాటు యంత్రాల వైపు రైతుల మొగ్గు
- త్వరగా పూర్తవుతున్న పనులు
- అందుబాటులో యంత్రాల మహిళా సమాఖ్య అద్దె కేంద్రాలు



యంత్రంతో మొక్కజొన్న పంటలో కలుపు తీస్తున్న రైతు

జిల్లాలోని ప్రతీ పల్లెలో పొలం పనులు చేయడానికి రైతులు అందుబాటులో ఉన్న యంత్రాలను ఉపయోగిస్తున్నారు. బ్యాంకులు రుణాలు, ప్రభుత్వాలు సబ్సిడీలు ఇవ్వడంతో సామాన్య, మధ్య తరగతి రైతులు సైతం ట్రాక్టర్లు, ఇతర పనిముట్లను కొనుగోలు చేస్తున్నారు. పంటల సాగుకు యోగ్యంగా మడిని సిద్ధం చేయడం మొదలు చేతికి వచ్చిన పంటను కోతలు పూర్తి చేసి మిల్లులకు తరలించే వరకు ఆధునిక పరికరాలు దోహద పడుతున్నాయి. దీంతో కాలానుగుణంగా రైతులు సాగు విధానంలో కూడా మార్పులు చేసుకుంటున్నారు. తక్కువ పెట్టుబడులు, అధిక దిగుబడులు లక్ష్యంగా రైతులు సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నారు. దీంతోపాటు చీడపీడలను నివారించే విషయంలో కూడా అధికారుల సలహాలను ఎప్పటికప్పుడూ పాటిస్తున్నారు.

తగ్గిన పశువుల వినియోగం..

గతంలో ఖరీఫ్, రబీ వంటి సీజన్‌లలో వ్యవసాయ పనులు చేపట్టానికి నాగలికి ఎద్దులను కట్టి పొలం దున్నేవారు. కానీ ఇప్పుడు యంత్రాలతో పనులు చేయిస్తున్నారు. ట్రాక్టర్‌తో దుక్కి దున్నడానికి ప్రస్తుతం ఎకరాకు రూ.1,300 నుంచి రూ.1,500 చెల్లిస్తున్నారు. భూమి చదును కోసం రొటోవేటర్‌కు ఎకరాకు రూ.1,500 నుంచి రూ.1,700 వరకు చెల్లిస్తున్నారు.



కూలీలకు బదులు ట్రాక్టర్‌తో విత్తనాలు నాటుతున్న దృశ్యం

మార్కెట్‌కు తరలించే వరకు..

చేతికొచ్చిన పంటను కూడా కోయడానికి కూలీల కొరత రావడంతో హార్వెస్టర్‌లను వినియోగిస్తున్నారు. గతంలో పంటలు ఒకేసారి చేతికొచ్చిన సమయంలో కూలీల కొరతతో రైతులు ఉక్కిరిబిక్కిరి అయ్యేవారు. యంత్రాల రాకతో కూలీలతో 5 నుంచి వారం రోజులు పట్టే పనిని ఒకే రోజు చేసే అవకాశం ఉన్నందున యంత్రాలపై అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు.

మారిన పరిస్థితుల దృష్ట్యా..



వెనుకటిలా గ్రామంలో పశువులు ఎక్కువగా లేవు. ఇప్పుడు వ్యవసాయమంతా యాంత్రీకరణ మీదే ఆధారపడి ఉంది. చిన్న పని చేయాలన్నా కూడా ట్రాక్టర్‌లతో చేయిస్తున్నాను. దానితోనే పనులు త్వరగా చేసుకునేందుకు వీలవుతుంది. యంత్రాల వినియోగం వల్ల ఖర్చు తక్కువగా కావడం తోపాటు సమయం కూడా ఆదా అవుతుంది.

– పోచయ్య, రైతు, వెల్దుర్తి

గతంలో వారం పట్టేది



యాంత్రీకరణ ద్వారా పనులు చేసుకోవడం ఎంతో సులువుగా మారింది. గతంలో నాటుకు పొలం సిద్ధం చేయాలంటే కనీసం వారం రోజులైనా పట్టేది. దుక్కి దున్నడం, భూమి చదును చేయడం, వరం సరి చేయడం వంటి పనులకే రోజులు పట్టేది. కానీ ట్రాక్టర్ల వల్ల ఒక్క రోజులోనే ఎకరానికి పైగా నాటడానికి సిద్ధంగా ఉంచేందుకు వీలవుతుంది.

– దుర్గపతిగౌడ్, రైతు, మంగళపర్తి

కిరాయికి యంత్రాలు..



మండల కేంద్రమైన వెల్దుర్తిలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవసాయ ఆధునిక యంత్ర పరికరాలు అద్దె కేంద్రం ఏర్పాటు చేశారు. స్త్రీ నిధి ద్వారా రుణాలు తీసుకొని రైతులకు తక్కువ కిరాయికి యంత్రాలను అందివ్వడం జరుగుతుంది. యంత్ర పరికరాన్ని బట్టి రోజు లెక్కన అద్దె తీసుకోవడం జరుగుతుంది. రైతుల నుంచి మంచి స్పందన లభిస్తుంది.

– శంకరయ్య, ఏపీఎం, వెల్దుర్తి

వ్యాధులపై సదస్సులు నిర్వహించాలి

- డీఎంహెచ్ఓ శ్రీనివాస్
- పీహెచ్‌సీ తనిఖీ



రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్

నంగునూరు(సిద్దిపేట): వేసవి కాలంలో వడదెబ్బపై అవగాహన కల్పించడంతోపాటు వచ్చే వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో సదస్సులు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఇన్‌పేషెంట్ సేవలు, ఫార్మసీ, స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్, డాక్టర్ ప్రవీణ్ నాయక్, ఏఓ రవీందర్‌రెడ్డి, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

గజ్వేల్‌రూరల్: ప్రజలు వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని కోట మైసమ్మ దేవాలయం సమీపంలో గల బస్తీ దవాఖానను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి, మందుల వివరాలను తెలుసుకున్నారు. ఆస్పత్రి సిబ్బంది సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు ఏవైనా పనులుంటే ఉదయం 11గంటల లోపు ముగించుకోవాలని, అవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం. శ్రీనివాస్, బస్తీ దవాఖాన వైద్యాధికారిణి డాక్టర్ గౌతమి, ఏవో రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హైవే పైకి దూసుకొచ్చిన లారీ

- వేగంగా ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- డ్రైవర్‌తో సహా ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలు
- కొండపాక క్రాస్ రోడ్డు వద్ద ఘటన



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

కొండపాక(గజ్వేల్): రాజీవ్ రహదారిపైకి లారీ ఒక్కసారిగా దూసుకు రావడంతో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సులోఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక క్రాస్ రోడ్డు వద్ద సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ రాజధాని బస్సు సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్టాండ్ నుంచి ఆదివారం అర్ధరాత్రి ప్రయాణికులతో కరీంనగర్‌కు వెళ్తుంది. ఇదే సమయంలో కొండపాక నుంచి జాతీయ రహదారి పైకి లారీ వస్తుంది. లారీ డ్రైవర్ చూసుకోకుండా ఒక్కసారిగా హైవే పైకి రావడంతో స్పీడ్‌గా ఉన్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ సీటు భాగం దెబ్బతింది. డ్రైవర్ లక్ష్మయ్య (40) తీవ్ర గాయాలతో సీటులో ఇరుక్కుపోయాడు. అలాగే ముందు భాగంలో కూర్చున్న ఇద్దరు ప్రయాణికులు శ్రీలత(36), దిలీప్(22)కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 అంబులెన్సు సిబ్బంది మహేందర్, శ్రీనివాస్ హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. డ్రైవర్ మంచిర్యాలకు చెందిన వ్యక్తిగా గుర్తించామని ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

యజమానినే చంపిన వర్కర్లు

- జగదేవ్‌పూర్‌లో దారుణ హత్య
- కాళ్లు చేతులు కట్టేసి.. నోరు మూసేసి
- పోలీసుల అదుపులో నిందితులు!



దుప్పట్లో మహిపాల్‌రెడ్డి మృతదేహం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధి కోసం వచ్చిన వారే.. యజమాని ఉసురు తీశారు.. వైర్లతో కాలు చేతులు కట్టేసి.. నోరు మూసి హత్య పాల్పడ్డారు..మృతదేహం వద్ద మద్యం సీసాలు, సిగరేట్లు డబ్బాలు కనిపించడంతో డబ్బుల కోసమే హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో సోమవారం కలకలం సృష్టించింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తూప్రాన్ మండలం వెంకటాపూర్(పీటీ) గ్రామానికి చెందిన బుచ్చిరెడ్డి మహిపాల్‌రెడ్డి(40) ఏడాదిన్నర కిందట నుంచి జగదేవ్‌పూర్‌లో రాంరెడ్డి చికెన్ సెంటర్‌ను నడుపుతూ అక్కడు ఉంటున్నాడు. బీహార్‌కు చెందిన ఇద్దరు యువకులు కురాబల్, రూబల్ చికెన్ దుకాణంలో పని చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో మహిపాల్‌రెడ్డికి భార్య మానస ఫోన్ చేసి బంధువుల ఫంక్షన్ ఉంది రమ్మని చెప్పింది. సోమవారం ఉదయం ఆర్డర్ ఉందని కాగానే వస్తానని చెప్పాడు. మళ్లీ ఆరు గంటల ప్రాంతంలో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఇదే విషయాన్ని మహిపాల్‌రెడ్డి సోదరుడు శ్రీపాల్‌రెడ్డికి ఫోన్ చేసి చెప్పగా తాను కూడా 9 గంటల ప్రాంతంలో ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చిందన్నాడు. అలాగు చికెన్ దుకాణంలో పనిచేసే కురాబల్, రూబల్‌లకు ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్ వచ్చాయి.

దుప్పట్లలో మృతదేహం..

సోమవారం ఉదయం 7 గంటలకు చికెన్ దుకాణం ఎదురుగా ఉన్న దాణా దుకాణం యజమాని కొండల్‌కు మహిపాల్‌రెడ్డి భార్య ఫోన్ చేసింది. దుకాణం తీసి ఉందా అని వివరాలు అడిగింది. మూసి వేసి ఉందని చెప్పడంతో సోదరుడు శ్రీపాల్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి వెంటనే జగదేవ్‌పూర్‌కు వచ్చారు. పక్కనే చిన్న షటర్‌ను తెరిచి లోనికి వెళ్లారు. దుకాణంలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. లోపల ఎవరూ లేకపోవడంతో మహిపాల్‌రెడ్డి కోసం గదులన్నీ వెతికారు. ఓ మూలన దుప్పట్లు కనిపించడంతో తెరిచి చూడగా మహిపాల్‌రెడ్డి మృతదేహం లభ్యమైంది. వెంటనే జగదేవ్‌పూర్ ఎస్‌ఐ చంద్రమోహన్‌కు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం సీఐ మహేందర్‌రెడ్డి, క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. ఇద్దరు నిందితులను సోమవారం రాత్రి వైజాక్‌లో రైల్వే పోలీసులు అక్కడ అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది!

పక్కా ప్రణాళికతోనే..

మహిపాల్‌రెడ్డి హత్య పక్కా ప్రణాళికతోనే జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం పరిశీలిస్తే కాళ్లు, చేతులు వైర్లతో కట్టేసి ఉండటం, ఒంటిపై తీవ్ర గాయాలు ఉండటాన్ని గుర్తించారు. దుకాణంలో సీసీ కెమెరా వైర్లు తెంపి ఉండడం, గల్లా పెట్టే కింద పడి ఉండడంతో నిందితులు ముందుగానే ప్లాన్‌తో ఈ ఘటనకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. దుకాణం వెనుకలా గది తలుపులు తెరిచి ఉన్నాయి. వర్కర్లే డబ్బు కోసం మహిపాల్‌రెడ్డిని హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

దుబ్బాకరూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని హబ్సిపూర్ వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం మేరకు.. అక్బర్‌పేట భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన చీమిడి బాల్‌రాజ్(45) దుబ్బాకలో మిషన్ భగీరథలో పని చేస్తాడు. ఈనెల 21న రాత్రి హబ్సిపూర్ నుంచి రామాయంపేట వైపు బైక్‌పై వెళ్తున్నాడు. బైక్‌ను హబ్సిపూర్ వద్ద నిలిపి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. రోడ్డున వెళ్లే వ్యక్తి గమనించి అతడి జేబులో ఉన్న ఐడీ కార్డు ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చరిత్ర తిరగరాయాలే

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



మాట్లాడుతున్న జగ్గారెడ్డి

పటాన్‌చెరుటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో 25 ఏళ్ల చరిత్రను తిరగరాయాలని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధును గెలిపించి అన్ని పార్టీలకు కంగు తినిపించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ముఖ్య నేతల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. మన అభ్యర్థి నీలం మధును గెలిపించుకొని, బీజేపీని ఖతం పట్టించాలని పేర్కొన్నారు. నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. ముఖ్య నేతలంతా కిందిస్థాయి నాయకులను సమన్వయం చేసుకొని కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ చైర్మన్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, సిద్దిపేట పూజల హరికృష్ణ, గజ్వేల్ ఇన్‌చార్జి నర్సారెడ్డి, ఆవుల రాజిరెడ్డి, చెరుకు శ్రీనివాస్ రెడ్డి, కాటా శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, ఎలక్షన్ రెడ్డి, ఎన్నికల కో ఆర్డినేటర్ అశోక్ గౌడ్, సుహాసిని, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

జోగిపేట జాతరలో అపశృతి

- నేలకు ఒరిగిన రావణాసురుడి ప్రతిమ
- ఐదుగురు కార్మికులకు గాయాలు



కింద పడిపోయిన రావణాసురుడి ప్రతిమ

జోగిపేట(అందోల్): జోగిపేట జాతరలో అపశృతి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జోగినాథ స్వామి ఆలయ రథోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి లంక దహన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక ఎన్టీఆర్ మైదానంలో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి దానికి రావణాసురుడి ప్రతిమను కట్టెలు, గోవ తాడుతో కట్టారు. ఇరువైపుల రావణాసురుడికి తలలను ఏర్పాటు చేస్తున్న క్రమంలో సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులు వీయడంతో 50 అడుగుల రావణాసురుడి ప్రతిమ కూలింది. దీంతో అక్కడే పని చేస్తున్న కార్మికులు మహేందర్, వెంకటేశ్, జాన్ కల్ రాము, ప్రవీణ్, రాములు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని జోగిపేటలోని ఓ ఆస్పత్రికి తరలించి పరిస్థితి విషమంగా ఉన్న వారిని సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ప్రవీణ్ అనే కార్మికుడు రాజమండ్రికి చెందిన వ్యక్తి కాగా, మిగతా వారు హైదరాబాద్‌కు చెందిన నిర్వాహకులుగా తెలిపారు.

పిడుగుపాటుతో మహిళ మృతి



కర్వ రేణుక మృతదేహం

కల్హేర్(నారాయణఖేడ్): పిడుగుపాటుతో మహిళ మృతి చెందిన ఘటన కల్హేర్ మండలం మాసాన్‌పల్లి శివారులో సోమవారం చోటు చేసుకుంది. మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన కర్వ రేణుక(32) ఊరి శివారులో మేకలు మేపుతుంది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం పడటంతో రేణుక, మరో ఇద్దరు ఓ చెట్టు కింది నిల్చున్నారు. ప్రమాదవశాత్తు పిడుగు పడి రేణుక అక్కడికక్కడే మృతి చెందింది. పక్కనే ఉన్న మల్లేశం అనే వ్యక్తికి గాయాలయ్యాయి. రేణుక మృతితో మాసాన్‌పల్లిలో విషాదం నెలకొంది. రేణుకకు భర్త కర్వ మల్లేశం, కుమారులు అభినందన్, శశికుమార్, ఇద్దరు కూతుర్లు గంగు, గౌరి ఉన్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు, కుటుంబీకులు కోరారు.

తాటి ముంజ.. భలే మజా



పట్టణ ప్రాంతంలో ముంజల అమ్మకాలు



అల్లీపూర్‌లోని తాటివనం

- కేరాఫ్ అడ్రస్‌గా అల్లీపూర్ గ్రామం
- తాటి చెట్లతో రైతులకు ఉపాధి
- వందల ఎకరాల్లో విస్తరించిన తాటివనం

శివ్వంపేట(నర్సాపూర్): అల్లీపూర్ గ్రామం అనగానే టక్కున గుర్తుకొచ్చేది తాటి ముంజలు. ఇక్కడ వందల ఎకరాల్లో సహజ సిద్ధంగా ఉన్నాయి. తాటి ముంజల్లో పోషక విలువలు పుష్కలంగా ఉండడంతోపాటు ప్రస్తుతం ఎండలు మండిపోతుండటంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది. మండల కేంద్రానికి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న అల్లీపూర్ గ్రామంలో ఎక్కువ భూ భాగం తాటి చెట్లు ఉన్నాయి. ప్రతీ సంవత్సరం ఏప్రిల్, మే మాసంలో తాటి ముంజల అమ్మకాలు జరుపుతారు.

పలువురికి ఉపాధి

పట్టా భూముల్లో ఉన్న తాటి ముంజలను విక్రయించడం వల్ల రైతులు లబ్ధి పొందుతున్నారు. సేకరించిన ముంజలను శివ్వంపేట, నర్సాపూర్, తూప్రాన్, మేడ్చల్, సంగారెడ్డి, మెదక్ ప్రాంతాల్లో రూ.100కు డజను చొప్పున విక్రయిస్తున్నారు. రైతులు సొంతంగా తాటి చెట్టు ఎక్కి తెంపడం, లేదా కూలీని పెట్టి ముంజలను తీయడం చేస్తున్నారు. నర్సాపూర్–వెల్దుర్తి ప్రధాన రహదారికి ఇరువైపుల గ్రామ శివారులో ఉన్న తాటివనం ఆహ్లాదక వాతావరణం చూపరులకు కనువిందు చేస్తుంది.

పరిహారం కరువు

తాటి చెట్ల ద్వారా ఉపాధి పొందుతున్న రైతులకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందడం లేదు. నాలుగేళ్ల కిందట గ్రామానికి చెందిన చింతకాయల సత్యనారాయణ, లంబడి లక్ష్మణ్ తాటి ముంజలు తెంపుతుండగా చెట్టుపై నుంచి పడి మృతిచెందారు. పరిహారం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకు అందలేదు.

రెండు నెలలు ఉపాధి



గ్రామంలో ఉన్న తాటి వనం వల్ల రెండు నెలల పాటు ఉపాధి దొరుకుతుంది. సేకరించిన ముంజలను వివిధ ప్రాంతాల్లో అమ్మకం ద్వారా ఆర్థికంగా లబ్ధి పొందుతున్నాం. సహజ సిద్ధంగా ఇక్కడ తాటి చెట్లు ఉండడం వరంగా భావిస్తాం. – రాజునాయక్, రైతు

ప్రభుత్వం సాయం అందలేదు



మా ఆయన తాటి ముంజలు చెట్టుపై నుంచి తెంపుతుండగా అదుపు తప్పి చెట్టుపై నుంచి కిందపడి చనిపోయాడు. నాలుగేళ్లు అవుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందలేదు. పరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా స్పందన లేదు. – లక్ష్మీ, బాధితురాలు

గ్రామానికే వన్నె



గ్రామ పరిధిలో వందలాది ఎకరాల్లో సహజ సిద్ధంగా ఉన్న తాటివనం గ్రామానికి వన్నెగా ఉంది. తాటి చెట్లతో గ్రామంలోని చాలా మంది కల్లు, తాటి ముంజల ద్వారా లబ్ధి పొందుతున్నారు. చుట్టు పక్కల ఎక్కడా లేకుండా కేవలం మా గ్రామ పరిధిలో తాటి చెట్లు ఉండడం ఇక్కడి వారి అదృష్టం. – రఘుగౌడ్, గ్రామస్తుడు